సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం , 24 , జూలై , 2023



మిడ్‌మానేరుకు వరద

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులోకి వరద వచ్చి చేరుతోంది. ఆదివారం ఎల్‌ఎండీకి 1,530 క్యూసెక్కులు వెళ్తుండ గా.. ప్రస్తుతం 15.38 టీఎంసీల నీరు ఉంది.



రోడ్డు కోసం ఎంపీకి వినతి

బోయినపల్లి(వేములవాడ): బోయినపల్లి నుంచి రామన్నపేటకు రోడ్డు మంజూరు చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి ఎంపీ బండి సంజయ్‌ని కోరారు.

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

సీఐ ఉపేందర్ బాధ్యతల స్వీకరణ



సిరిసిల్లక్రైం: సిరిసిల్లటౌన్ సీఐగా భీమ నాథుల ఉపేందర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సిరిసిల్లలో ఎస్‌ఐ స్థాయి నుంచి సీఐ స్థాయి వరకు వివిధ విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని పేర్కొన్నారు. ఏదేని సమస్య వస్తే తన దృష్టికి తీసుకొస్తే చట్టపరిధిలో పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ అందరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్
- ఆగస్టు 13న హైదరాబాద్‌లో యాదవ యుద్ధభేరీ

సిరిసిల్ల: యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, బడ్జెట్‌లో 18 శాతం నిధులు కేటాయించాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ కోరారు. సిరిసిల్లలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. వెంకట్‌యాదవ్ మాట్లాడుతూ రాజకీయాల్లో యాదవుల వాటా కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో సబ్బండ వర్గాలు పోరాటాన్ని సాగించాయని గుర్తుచేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని రాజకీయపక్షాలు యాదవులకు సముచిత స్థానం కల్పించాలని, జనాభా దామాష పద్ధతిలో యాదవులకు 22 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. యాదవ, కుర్మల సామాజిక న్యాయం కోసం రాజకీయశక్తిగా ఎదగడమే విద్యావంతుల వేదిక లక్ష్యమని స్పష్టం చేశారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో లక్ష మందితో యాదవ యుద్ధభేరి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు పోస్టర్ ఆవిష్కరించారు. గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరియాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మిరాల భాస్కర్‌యాదవ్, నాయకులు బండ నర్సయ్యయాదవ్, జెగ్గాని మల్లేశం, మెండె శ్రీనివాస్, అంబటి సంతోష్, జక్కుల నాగరాజు, బొబ్బల మల్లేశ్, జడల శ్రీనివాస్, మందాటి తిరుపతి, మోతె మహేశ్, మందాటి రాజలింగం, దేవయ్య, గోలు మల్లేశం, బండి దేవదాస్, మధు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జిల్లాలో మళ్లీ వర్షం

- రుద్రంగి, వేములవాడల్లో మోస్తరు వాన
- మరో ఏడు మండలాల్లో చిరుజల్లులు
- మిగతా ప్రాంతంలో పొడి వాతావరణం

సిరిసిల్ల: జిల్లాలో నాలుగు రోజులు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం శనివారం గెరువు ఇవ్వగా ఆదివారం రాత్రి మళ్లీ కురిసింది. కొద్దిపాటి చినుకులు పడ్డాయి. ఆదివారం సాయంత్రం రుద్రంగిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మిగతా మండలాలైన బోయినపల్లిలో 2.1 మిల్లీమీటర్లు, సిరిసిల్లలో 0.6, వీర్నపల్లిలో 0.3, ఎల్లారెడ్డిపేటలో 1.2, గంభీరావుపేటలో 1.3, ముస్తాబాద్‌లో 0.8, ఇల్లంతకుంటలో 0.6 మిల్లీమీటర్ల చిరుజల్లులు కురిశాయి. జిల్లాలోని మిగతా అన్ని మండలాల్లోనూ పొడి వా తావరణ నెలకొంది. వారం రోజుల తర్వాత పూర్తి స్థాయిలో సూర్యుడు కిరణాలు నేలను తాకడంతో వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు.

రుద్రంగి(వేములవాడ): రుద్రంగిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికే ఒర్రెలు, వాగులు పారుతున్నాయి. చెరువులు, కుంటలలో నీరు చేరుతూ చెరువులు, కుంటలలో వరద వచ్చి చేరింది. ఆదివారం కురిసిన వర్షంతో ఒర్రెలు, వాగులు పొంగుతున్నాయి.

వేములవాడ: వేములవాడలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి గెరువిచ్చిన వాతావరణం రాత్రి వేళ ఒక్కసారిగా మేఘావృతమై భారీ వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి.



రుద్రంగిలో కురుస్తున్న వాన

పెంటివాగుకు మరమ్మతులు



కోనరావుపేట(వేములవాడ): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కొండాపూర్ శివారులో కొట్టుకుపోయిన పెంటివాగుపై రోడ్డుకు ఆదివారం మరమ్మతు పనులను సర్పంచ్ మల్యాల దేవయ చేపట్టారు. సిరిసిల్ల-నిమ్మపల్లి డబుల్‌రోడ్డు మధ్యలో కొండాపూర్ శివారులో పెంటివాగు ప్రవాహానికి రహదారి కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు కోనరావుపేట మీదుగా నిమ్మపల్లికి వెళ్తున్నాయి. సర్పంచ్ ఆధ్వర్యంలో మట్టిపోయించారు.



క్లుప్తంగా

గాంధీభవన్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



గాంధీభవన్‌కు తరలిన నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు పార్టీలో సరైన గౌరవం ఇవ్వక పోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండల నాయకులు ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్‌కు తరలివెళ్లారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్‌కు పార్టీ పరంగా పదవులుఇవ్వకపోవడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తున్న పొన్నంకు పార్టీలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు వంగ గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనవేని రవి, చెన్నిబాబు, బానోతు రాజునాయక్ ఉన్నారు.

పద్మశాలి మేళాను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

వేములవాడ: కోరుట్లలో ఆగస్టు 13న జరిగే పద్మశాలి రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని వేములవాడ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రజనీకాంత్ కోరారు. వేములవాడలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలన్నారు. రాష్ట్రంలోని రాజకీయపార్టీలకు పద్మశాలీల బలం తెలిసేలా ఈ సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. పద్మశాలి ఆత్మగౌరవసభ రాష్ట్ర కన్వీనర్ బస్వాపూర్ లక్ష్మీనర్సయ్య, కో–కన్వీనర్లు నాంచారి ప్రభాకర్, బోగ వెంకటేశ్వర్లు లగిశెట్టి శ్రీనివాస్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గాజులబాలయ్య, రుద్ర శ్రీనివాస్, వేముల రామ్మూర్తి, నాయకులు రాపెల్లి శ్రీధర్, అంబటి బాలాద్రి, భోగ మధు, తాటికొండ రాజయ్య, తాటికొండ శంకరయ్య, వేముల శ్రీనివాస్, కట్టెకోల రాంప్రసాద్, నాగుల విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లఅర్బన్: మహిళా సాధికారతకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలో సక్సెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యూటీ సోల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన్డే స్కిల్స్ సర్టిఫికెట్ కోర్సు, బ్యూటీ అండ్ వెల్‌నెస్ అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగానే ఉద్దేశ్యంతో వీ హబ్‌ను ప్రారంభించారన్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేలా ముందుకుసాగాలన్నారు. అనంతరం కేటీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. సక్సెస్ ఇనిస్టిట్యూట్ బ్యూటీ అకాడమీ డైరెక్టర్ స్వప్నరావు, సందీప్, భానుప్రకాశ్ ఉన్నారు.

హాట్‌టాపిక్‌గా వేములవాడ సీఐ పోస్టు

- ఆలస్యం వెనుకు అంతర్యమేమిటో?
- నలుగురిలో ఇద్దరికే అవకాశం
- రాజన్న ఆశీస్సులు ఎవరికో ?!

సిరిసిల్లక్రైం: వేములవాడ సర్కిల్ పోస్టింగ్‌లు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. జిల్లాలోని సివిల్, ఎస్బీ, డీసీఆర్‌బీ వంటి అన్ని విభాగాల సీఐ స్థానాలు, అన్ని ఠాణాల్లోని ఎస్సైలను సైతం బదిలీ చేయడం.. ఆయా ఖాళీలను భర్తీ చేయడం సైతం పూర్తయింది. కానీ వేములవాడటౌన్, వేములవాడ రూరల్ సీఐ స్థానాలను ఇప్పటి వరకు ఎవరికీ కేటాయించలేదు. దీంతో ఇక్కడి సీఐగా వచ్చేందుకు రాజన్న ఆశీస్సులు ఎవరికి ఉంటాయోనన్న చర్చ సాగుతోంది. వేములవాడ పోస్టింగ్ విషయంలో జిల్లా ఆవిర్భావం నుంచి ప్రతీసారి ఆసక్తికరంగానే మారుతంది. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో వేములవాడ టౌన్ పోస్టింగ్‌కు ఇద్దరు, వేములవాడ రూరల్ పోస్టింగ్‌కు మరో ఇద్దరు పోటాపోటీగా ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్థానిక ఎమ్మెల్యే ఒకరికి భరోసా ఇవ్వగా, బీఆర్‌ఎస్ టికెట్ ఆశిస్తున్న మరో నాయకుడు ఇంకొకరికి భరోసా ఇచ్చినట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. ఇదిలా ఉంటే ఇన్నాళ్లు జిల్లాలో సేవలందించిన పోలీసు అధికారులకు అవకాశం ఇవ్వడం సమంజసమనే చర్చ డిపార్ట్‌మెంట్‌లో ఉంది. ఇన్నాళ్లు అనుకున్న పేర్లు గల్లంతయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నట్లు తెలుస్తుంది. లూప్‌లైన్‌లో ఇన్నాళ్లు విధులు నిర్వహించిన వారికి అవకాశం ఇవ్వడమే అన్ని విధాలుగా శ్రేయస్కరమని సీనియర్ పోలీసు అధికారులు చర్చించుకుంటున్నారు. ఇలా జరిగితే సిరిసిల్ల టౌన్ సీఐగా కరుణాకర్, వేములవాడరూరల్ సీఐగా కృష్ణకుమార్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో పనిచేస్తున్న వీరిద్దరిని పోస్టింగ్స్‌పై అవకాశం వస్తే సమర్థంగా విధులు నిర్వహిస్తామని అధికారిక ఉత్తర్వులు రాక ముందు ఏమి మాట్లాడలేమని స్పష్టం చేశారు. పనితోపాటు పరిస్థితులు, అదృష్టాన్ని, రాజన్న ఆశీస్సులు కోరుతున్నామని చెప్పడం గమనార్హం.

ఆన్‌లైన్‌లో రైల్వేపాసులు ఇవ్వాలి



మాట్లాడుతున్న రాజేందర్

సిరిసిల్లటౌన్: ఆన్‌లైన్‌లో రైల్వేపాసులు అందించాలని దివ్యాంగుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు మంగళారపు రాజేందర్ కోరారు. సిరిసిల్లలో ఆదివారం నిర్వహించిన సంఘం జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు యెల్లె హరిప్రసాద్, బొద్దుల రవి, ఆకుల సంధ్య, వెంగళ శ్రీనివాస్, ఖాదర్, అక్రమ్, కిషన్ పాల్గొన్నారు.

నిరుపేద వైద్యానికి సర్కారు సాయం

- రూ.2లక్షల ఎల్‌వోసి అందించిన కేటీఆర్



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందిస్తున్న కౌన్సిలర్ రాజు

సిరిసిల్లటౌన్: నిరుపేద వైద్యానికి డబ్బులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల సాయం అందించింది. స్థానిక 36వ వార్డుకు చెందిన చొక్కి తిరుపతికి అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతనికి ఖరీదైన వైద్యం అవసరం కావడంతో నిరుపేద కుటుంబ పరిస్థితిని స్థానిక కౌన్సిలర్ కల్లూరి రాజు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం నుంచి రూ.2లక్షల ఎల్‌వోసిని అందించగా..వైద్యం అందింది. ఎల్‌వోసీ కాపీని కౌన్సిలర్ రాజు బాధిత కుటుంబానికి ఆదివారం అందించారు. గడ్డం వెంకటేష్, కొక్కుల నర్సయ్య, ఎర్రం ఎల్లయ్య, అంబదాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

- కిష్టునాయక్‌తండాలో విషాదం



ఉదయ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎప్పుడు ఫోన్‌లో యూట్యూబ్ చూడొద్దని బాగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. విద్యార్థి మృతిఘటన తండాలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాలు. మాలోతు రేణ–ప్రశాంత్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఉదయ్(11) రాజన్నపేటలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవు దినం కావడంతో ఉదయ్ ఇంటి వద్ద ఉండగా తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికొచ్చిన వారికి ఉదయ్ కనిపించలేదు. రాత్రి పొద్దుపోయే వరకు గాలించారు. ఇంట్లోని వంట గదికి గడియపెట్టి ఉండడంతో అనుమానం వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా గోడ మేకుకు లుంగితో మెడకు చుట్టుకొని ఉరేసుకొని ఉన్నాడు. కొనఊపిరితో ఉన్న ఉదయ్‌ని ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. యూట్యూబ్ చూడొద్దని చదువుకోవాలని మందలించిన పాపానికి చెట్టంతా కొడుకు మమ్మల్ని విడిచి వెళ్లాడని ఆ దంపతుల రోదనలు అందరిని కలచివేశాయి. మృతుడి తండ్రి ప్రశాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం

- గాయపడ్డ గొల్లపల్లి వాసులు
- ఒకరి పరిస్థితి విషమం



గాయపడ్డ మహబూబీ



బాధితులను పరామర్శిస్తున్న గొల్లపల్లి నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కామారెడ్డి జిల్లా ఉగ్రవాయి వద్ద ఆదివారం ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామస్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డిపేటకు వస్తున్న ప్యాసింజర్ ఆటోలో రాచర్లగొల్లపల్లికి చెందిన మహబూబీ, బైరి లావణ్య, కొండ రమాదేవి ప్రయాణిస్తున్నారు. మాచారెడ్డి నుంచి కామారెడ్డి వెళ్తున్న కారు వేగంగా వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఉగ్రవాయి దగ్గర ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కామారెడ్డికి చెందిన కార్ డెకార్ పనిచేసే యువకుడు శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మహబూబీ, లావణ్య తీవ్రంగా గాయపడ్డారు. మహబూబీ కాలు విరగడంతో పరిస్థితి విషమంగా మారింది. రమాదేవికి స్వల్పంగా గాయాలయ్యాయి. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎంపీపీ ఎలుసాని మోహన్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్, సర్పంచ్ పాశం సరోజన, నాయకులు కొండ ఆంజనేయులుగౌడ్, దేవారెడ్డి తదితరులు కామారెడ్డి ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు.

తప్పిపోయిన అమ్మమ్మ, మనుమడి అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న కానిస్టేబుళ్లు కార్తిక్, ఫారుక్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో తప్పిపోయిన అమ్మమ్మ, మనుమడిని కానిస్టేబుళ్లు వెతికి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు మండలంలోని పద్మానగర్‌లో శనివారం సాయంత్రం తప్పిపోయిన అమ్మమ్మ వడ్డెపల్లి లచ్చవ్వ, మనవడు నూతి బిట్టును ఆదివారం మధ్యాహ్నం అంకుషాపూర్ శివారులో గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అమ్మమ్మ, మనువడిని గుర్తించడంలో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు కార్తీక్, ఫారుక్‌ను పలువురు అభినందించారు.

రోడ్డుపై పడి వ్యక్తి మృతి



రవి(ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని ముచ్చర్ల తండాకు చెందిన భూక్య రవి తన ఇంటి ముందున్న సీసీరోడ్డుపై నిల్చొని ఉన్నట్టుండి తలతిరిగి రోడ్డుపై పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన రవి ఆసస్మారక స్థితికి చేరడంతో స్థానికులు సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన రవి చదువు మధ్యలో ఆపేసి కూలీపనులు చేస్తున్నాడు. రవికి భార్య మునిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి



నరేశ్ మృతదేహం

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన దేవరకొండ నరేశ్ (39) అనే వ్యక్తి అదే గ్రామ సమీపంలోని మానేరు వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి నీటిలో పడి ఈత రాకపోవడంతో మృతిచెందాడు. శనివారం మధ్యాహ్నం మృతుడు నరేశ్ మానేరువాగులో చేపలు పట్టేందుకు వెళ్లి నీటిలో పడిపోగా మృతదేహం ఆదివారం మధ్యాహ్నం నీళ్లలో తేలిందని, గమనించిన గ్రామస్తులు వెంటనే మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాజేశ్ ఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య జాన్సీ, కుమారుడు చరణ్ ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం
- క్రైస్తవ సంఘాల నిరసన



మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్యకర్తలు

వేములవాడ: మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మహిళా కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మణిపూర్ సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలకు రక్షణ లేదని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పాత సత్యలక్ష్మి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: మణిపూర్ ఘటనపై రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో శాంతియుత ప్రార్థనలు జరిపారు. క్రైస్తవులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కేంద్ర, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో రాగుల రాములు, పాస్టర్ మనోహర్, రాంచంద్రం, నాంపెల్లి, జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి తీయాలి

కోనరావుపేట: మణిపూర్ ఘటనలో నిందితులను ఉరితీయాలని లంబాడిల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌కుమార్ అన్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేదన్నారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్యాల జాన్సన్, అజీమ్, మనోజ్ కుమార్, సాగర్, చంద్రయ్య, రమేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

















